**ప్రపంచంలో ఎన్నో అద్భుతమైన విషయాలు ఉన్నాయి. కానీ, పొరపాటున కూడా ఎవరూ వాటిని పట్టించుకోరు.**

**-ఆర్థర్ కానన్ డోయెల్**

.. అలాంటి అనేకానేక అత్యద్భుత విషయాల్లో 'నూన్-చీ' ఒకటి.

ఎదుటి మనిషిని అంచనా వేయడానికైనా, ప్రస్తుత పరిస్థితిని బేరీజు వేయడానికైనా కళ్లను మించిన కొల మానం లేదనేది 'నూన్-చీ' సిద్ధాంత మూలసారం.

ఉదాహరణకు ఓ పెద్ద కంపెనీలో కొత్తగా చేరారు మీరు. సరిగ్గా ఆ రోజే పార్టీ జరుగుతున్నది. మిమ్మల్ని కూడా పిలిచారు. నలుగుర్నీ ఇంప్రెస్ చేయడానికి అదో మంచి అవకాశం కూడా. సరిగ్గా మీరు కాలుపెట్టే సమయానికి ఓ పెద్దావిడ ఏదో జోక్ చెబుతున్నది. అందరూ పగలబడి నవ్వుతున్నారు. అప్పుడు మీరేం చేస్తారు?

**ఒకటి..** అంతకంటే మంచి జోక్ చెప్పి నవ్విస్తారా?

**రెండు..** ఆ జోక్ ఏమంత గొప్పగా లేకపోయినా పగలబడి నవ్వేస్తారా?

**మూడు..** ఆ జోక్ చెప్పిన పెద్దావిడని మెచ్చుకుంటారా?

మీ సమాధానం..

**ఒకటి** అయితే.. మీ 'నూన్-చీ' పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

**రెండు** అయితే.. మీరు బృంద మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నట్టే.

**మూడు** అయితే.. అభినందనలు. మీకు 'నూన్-చీ' సత్తా తెలిసినట్టే.

నూన్-చీ అనేది కొరియన్ సూపర్ పవర్. ఎదుటి మనిషి మనసును ఓ పుస్తకంలా చదివేయగల శక్తి కొరియన్లకు ఉందనీ, అది 'నూన్-చీ' వల్లే వచ్చిందనీ ఓ ప్రచారం. ఆ మాట నిజమే కావచ్చు.

ఎదుటి మనిషి..

ఏం ఆలోచిస్తున్నారు?

ఎలా ఫీలవుతున్నారు?

అనేది ఆ క్షణానికే మనకు తెలిస్తే కనుక, సగం సమస్య పరిష్కారం అవుతుంది.

ఆ వ్యక్తి మాటలు, హావభావాలు, కదలికలు అందుకు తోడ్పడతాయి.

ఆ బేరీజు కచ్చితంగా జరగాలంటే.. మీరు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి అరుదైన సామర్థ్యం ఉన్న వారి ప్రస్తావన వచ్చినప్పుడు కొరియన్లు 'ఆ వ్యక్తి నూన్-చీ బావుంది' అనరు. 'ఆ వ్యక్తి నూన్-చీ వేగవంతంగా ఉంది' అని కితాబు ఇస్తారు. ఇక్కడ వేగం చాలా ముఖ్యం.

ఈ కళను కనుక ఒంటబట్టించుకుంటే.. బంధాలు బలపడతాయి. ఇదొక రహస్య ఆయుధం. కనిపించని క్షిపణి. నీ సగం జీవితం నూన్-చీ చుట్టే తిరుగుతుంది. మంచి స్నేహితుల్ని ఎంచుకోవచ్చు. మంచి జీవిత భాగస్వామిని మనువాడవచ్చు. మంచి కస్టమర్లకు డిస్కౌంట్లు ఇచ్చి వ్యాపారం పెంచుకోవచ్చు. ఉద్యోగంలో పేరు తెచ్చుకోవచ్చు. శత్రువుల నుంచి రక్షించుకోవచ్చు. ఈ సూత్రాన్ని దక్షిణ కొరియా వ్యక్తిగత జీవితాలకే కాదు, ప్రభుత్వ పాలనకూ అన్వయించుకుంటుంది.



## సున్నా నుంచి..

ఐదు దశాబ్దాల్లో దక్షిణ కొరియా.. అనూహ్యమైన ప్రగతిని సాధించింది. కటిక పేదరికం నుంచి అపార సంపదల వైపు అడుగులు వేసింది. ఒకనాడు దక్షిణ కొరియా అత్యంత నిరుపేద దేశం. దానికితోడు సహజ వనరులు లేవు. పాతాళానికి తవ్వినా చుక్క పెట్రోలు కూడా దొరికేది కాదు. ఇరవై ఒకటో శతాబ్దం నాటికి ముఖచిత్రమే మారిపోయింది. సంపదలకు నిలయమైంది. సాంకేతికతకు చిరునామాగా మారింది. ఇన్ని విజయాలకు కారణం ఒక్కటే.. 'నూన్-చీ'. బాల్యం నుంచీ తల్లిదండ్రులు పిల్లలకు ఈ సూత్రాన్ని బోధిస్తారు. తెలుగు పేరెంట్స్ 'నీకసలు బుద్ధి ఉందా?' అన్నట్టుగానే.. 'నీకసలు నూన్-చీ ఉందా?' అని దక్షిణ కొరియా తల్లిదండ్రులు పిల్లల్ని కోప్పడతారు.

కొందరికి నూన్-చీ పుట్టుకతోనే వస్తుంది. కొందరికి పెంపకంతో సాధ్యపడుతుంది. మరికొందరు సాధనతో సొంతం చేసుకుంటారు. ఇంకొందరు అనుభవాలతో రాటుదేలతారు.

దక్షిణ కొరియన్ల జీవితాన్ని సంప్రదాయ సూత్రాలే నడిపిస్తాయి. తమకంటే ఒక్క రోజు పెద్ద అయినా సరే.. గౌరవ వాచకం జోడించకుండా పిలవరు. ఎదుటి మనిషికి విజిటింగ్ కార్డు ఇస్తున్నప్పుడు.. ప్రసాదం అందించినంత భక్తిగా రెండు చేతులతో ఇస్తారు. ఎదుటి వ్యక్తి కూడా అంతే గౌరవంగా అందుకుంటారు. తీసుకోగానే పర్సులో తురిమేసుకోరు. ఓసారి ఆసాంతం చదివి, మల్లెపువ్వంత సుతారంగా కార్డుల డబ్బాలో జోడిస్తారు.

**ప్రాథమిక సూత్రాలు..**

- ఎదుటి మనిషి పరిస్థితిని అర్థం చేసుకోకుండా మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు.
- ఎవరైనా పరోక్షంగా చెప్పినా సరే, నేను అర్థం చేసుకోగలను.
- అంతరంగాల్ని అర్థం చేసుకోవడం నాకు వెన్నతో పెట్టిన విద్య.
- ఇతరుల్ని అసౌకర్యానికి గురిచేయడం నాకు ఇష్టం ఉండదు.
- నలుగురి మధ్య ఉన్నప్పుడు.. ఎప్పుడు నిష్క్రమించాలో నాకు తెలుసు.

'నీ అంతట నువ్వు ముందుగా హాని తలపెట్టొద్దు' .. ఇదీ తొలి నియమం. దీనివల్ల సమస్య పరిష్కారం సులభం అవుతుంది. అదే నోరు పారేసుకోవడమో, చెంపలు పగలగొట్టుకోవడమో మొదలు పెడితే రచ్చ రచ్చ. బూతులు ప్రవహిస్తాయి. రక్తం పారుతుంది.

## ఇదొక ఉద్వేగ ప్రజ్ఞ

అవును. నూన్-చీ ఓ ఉద్వేగ ప్రజ్ఞ. ఎదుటి వ్యక్తి ఎమోషన్స్‌ను అర్థం చేసుకోడానికి, మన ఎమోషన్స్‌ను నియంత్రించుకోడానికి బాగా పనికొస్తుంది. 'నోరు మూయించగల శక్తి ఉన్నా, నేలమట్టం చేయగల భుజబలం సొంతమైనా, దెబ్బతీయడం అనివార్యమైనా... ఓరిమితో వ్యవహరించేవాడే విజ్ఞుడు' అంటుంది నూన్-చీ. ఎమోషనల్ ఇంటెలిజన్స్ ఉన్నప్పుడే ఇదంతా సాధ్యం అవుతుంది. నూన్-చీలో ఓ క్విజ్ ఉంది. మీరూ ప్రయత్నించండి.

**కింది స్టేట్‌మెంట్స్‌లో క్విక్ నూన్-చీకి ప్రాతినిధ్యం వహించే విషయం ఏది?**

**ఎ.** మీకు ఆతిథ్యం ఇచ్చిన వ్యక్తి.. కాఫీ ఇచ్చిన కాసేపటి తర్వాత.. 'కూరలు తక్కువగా ఉన్నాయి. మరి,



### బంగారు చెంచా!

నూన్-చీని అతిసామాన్యుల ఆయుధంగా అభివర్ణిస్తారు కొరియన్లు. ఎదుటి మనిషిని అర్థం చేసుకునే శక్తే నీకున్న సైన్యం. మనసులో దూరిపోయి అంతరంగాన్ని గ్రహించగలిగిన విద్యే.. మేనేజ్‌మెంట్ డిగ్రీ. నూన్-చీ తెలియకపోతే మాత్రం, నోట్లో బంగారు చెంచాతో పుట్టినా సరే.. ఆ చెంచా ఏదో ఓ దశలో నోట్లోంచి జారిపోవడం ఖాయమని చెబుతారు కొరియన్ పెద్దలు.

